సూర్య www.suryaa.com
17వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
14 జూన్ 2024
పేజీలు: 02



నారా చంద్రబాబు నాయుడు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు

# ఆంధ్రప్రదేశ్ మంత్రులకు శాఖల కేటాయింపు..

ఏపీ మంత్రుల శాఖలు ఖరారయ్యాయి. పవన్ కల్యాణ్ కు పంచాయతీరాజ్ శాఖ(డిప్యూటీ సీఎంగా) దక్కింది. ఐటీ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు చూడనున్నారు. ఆర్థిక శాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ కు ఛాన్స్ దక్కింది. వంగలపూడి అనితకు హోంశాఖ దక్కింది. గొట్టిపాటి రవి కుమార్ కు విద్యుత్ శాఖ బాధ్యతలను చూడనున్నారు.టీడీపీలో సీనియర్ నేతగా ఉన్న అచ్చెన్నాయుడికి ఈసారి వ్యవసాయశాఖ దక్కింది. కొల్లు రవీంద్రకు మైనింగ్ మరియు ఎక్సైజ్ శాఖ ఖరారైంది. జనసేన నుంచి గెలిచిన నాదెండ్ల మనోహర్,.. పౌరసరఫరాల శాఖ బాధ్యతలు చూడనున్నారు. 2014లో చంద్రబాబు కేబినెట్ లో మున్సిపల్ శాఖ బాధ్యతలు చూసిన నారాయణకు.. మరోసారి అదే శాఖ దక్కింది.బీజేపీ నుంచి గెలిచిన సత్య కుమార్ యాదవ్ .. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ బాధ్యతలు చూడనున్నారు. నిమ్మల రామనాయుడుకు నీటి పారుదల శాఖ ఖరారైంది. వైసీపీ నుంచి టీడీపీలో చేరి గెలిచిన ఆనం రాంనారాయణరెడ్డికి దేవాదాయశాఖను కేటాయించారు. కీలకమైన ఆర్థిక శాఖను పయ్యావుల కేశవ్ కు అప్పగించారు. అనగాని సత్యప్రసాద్ .. రెవెన్యూ శాఖ బాధ్యతలు చూడనున్నారు. ఇక వైసీపీ నుంచి చివర్లో బయటికి వచ్చి నూజివీడు నుంచి గెలిచిన కొలుసు పార్థసారథికి హౌసింగ్ శాఖ దక్కింది. జనసేన నుంచి గెలిచిన కందుల దుర్గేశ్ కు పర్యాటకం, సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖ ఖరారైంది.

| | | |
|---|---|---|
| **కొణిదెల పవన్ కళ్యాణ్**<br>పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సైన్స్ అండ్ టెక్నాలజీ (డిప్యూటీ సీఎం) | **సత్యకుమార్ యాదవ్**<br>వైద్య ఆరోగ్యశాఖ | **గొట్టిపాటి రవి**<br>విద్యుత్ శాఖ |
| **నారా లోకేష్**<br>ఐటీ,విద్య, మానవ వనరులు, రియల్ టైమ్ గవర్నెన్స్ | **నిమ్మల రామానాయుడు**<br>నీటి పారుదల శాఖ | **కందుల దుర్గేష్**<br>పర్యాటకం, సినిమాటోగ్రఫీ |
| **కింజరాపు అచ్చెన్నాయుడు**<br>వ్యవసాయశాఖ, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ | **ఎన్.ఎమ్.డి.ఫరూక్**<br>మైనార్టీ వెల్ఫేర్ | **గుమ్మడి సంధ్యారాణి**<br>మహిళా సంక్షేమం, గిరిజన సంక్షేమ |
| **వంగలపూడి అనిత**<br>హోంశాఖ మంత్రి, విపత్తు నిర్వహణ | **ఆనం రామనారాయణరెడ్డి**<br>దేవాదాయశాఖ | **బీసీ జనార్ధన్ రెడ్డి**<br>రోడ్లు భవనాల శాఖ |
| **కొల్లు రవీంద్ర**<br>మైనింగ్ మరియు ఎక్సైజ్ శాఖ | **పయ్యావుల కేశవ్**<br>ఆర్థికశాఖ | **టీజీ భరత్**<br>పరిశ్రమల శాఖ |
| **పి.నారాయణ**<br>మున్సిపల్ మంత్రిత్వ శాఖ | **అనగాని సత్యప్రసాద్**<br>రెవెన్యూ శాఖ | **ఎస్.సవితమ్మ**<br>బీసీ సంక్షేమ శాఖ |
| **నాదెండ్ల మనోహర్**<br>పౌరసరఫరాల శాఖ | **కొలుసు పార్థసారథి**<br>గృహనిర్మాణ, ఐ అండ్ పీఆర్ | **వాసంశెట్టి సుభాష్**<br>కార్మిక శాఖ |
| **బాలవీరాంజనేయస్వామి**<br>సాంఘిక సంక్షేమ శాఖ | **కొండపల్లి శ్రీనివాస్**<br>సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల శాఖ | **మండిపల్లి రామ్ ప్రసాద్**<br>రవాణా శాఖ, క్రీడా శాఖ |

# వచ్చే నెలలో కేంద్ర బడ్జెట్?



2024-25 ఏడాదికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ జూలై మూడో వారంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ ఆ శాఖ సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. 2024-25 బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. కచ్చితమైన ప్రణాళిక, సమగ్ర విశ్లేషణతో బడ్జెట్‌ను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

# ఢిల్లీలో నీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు



ఢిల్లీలో నీటి కొరత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. నీళ్ల కోసం ప్రజలు క్యూ కడుతున్నారు. వాటర్ క్యాన్లను లైనులో పెట్టి ట్యాంకర్ల కోసం ఎదురుచూస్తున్నారు. ట్యాంకర్లు రాగానే క్యాన్లు, బకెట్లతో పోటాపోటీగా నీళ్లు పట్టుకునేందుకు పరుగులు తీస్తున్నారు. తీవ్ర ఎండలతో పాటు హరియాణా నుంచి నీటి సరఫరా ఆగిపోవడమే నీటి కొరతకు కారణమని స్థానికులు చెబుతున్నారు.

**ఆప్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**

దేశ రాజధాని న్యూఢిల్లీలో మంచి నీటి కొరత తీవ్రంగా ఉంది. దీనిపై సుప్రీంకోర్టు ఆప్ ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీచేసింది. నీటి సరఫరా కోసం అప్పర్ యమునా రివర్ బోర్డ్‌తో సంప్రదింపులు జరపాలని సూచించింది. న్యూఢిల్లీలో నెలకొన్న పరిస్థితులు నేపథ్యంలో మానవతా దృక్పథంతో మంచి నీటిని సరఫరా చేయాలంటూ అప్పర్ యమునా రివర్ బోర్డ్‌కి ఈ రోజు సాయంత్రం 5.00 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. ఇది సున్నితమైన అంశమని చెప్పింది.

## బక్రీద్ రోజున రోడ్డుపై నమాజ్ చేయొద్దు: సీఎం వార్నింగ్



**ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ లోక్‌సభ ఎన్నికల తర్వాత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శాంతిభద్రతల విషయంలో సమన్వయం చేసుకోవాలని, ప్రజల విశ్వాసాన్ని పొందాలని అధికారుల్ని ఆదేశించారు. జిల్లా, మండల స్థాయిల్లో జనతా దర్శన్ కార్యక్రమాలను వెంటనే ప్రారంభించాలని అధికారుల్ని ఆదేశించారు. రానున్న బక్రీద్ పండుగల సందర్భంగా రోడ్డుపై నమాజ్ చేయరాదని, నిషేధిత జంతువులను వధిస్తే చర్యలు తీసుకుంటామని సీఎం చెప్పారు.**



# తొలి సీఎన్‌జీ బైక్ ఆవిష్కరణ వాయిదా

ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ బైక్(బ్రూజర్ 125) ఆవిష్కరణను జులై 17కు వాయిదా వేస్తున్నట్లు బజాజ్ ఆటో వెల్లడించింది. ఈ నెల 18న విడుదల చేయనున్నట్లు గతంలో తెలపగా, ఇప్పుడు అనివార్య కారణాలతో వాయిదా వేసింది. కాగా సీఎన్‌జీ వాహనాలపై జీఎస్టీని 28 శాతం నుంచి 12 శాతానికి తగ్గించాలని ఆటోమొబైల్ తయారీదారుల సంఘం కేంద్రాన్ని తాజాగా కోరింది. దీనిపై భారీ పరిశ్రమల శాఖ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.



# రోహిత్, నేను ఒకే స్కూల్: హర్మీత్ సింగ్

భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, తాను ఒకే స్కూల్ అని యూఎస్ఏ ప్లేయర్ హర్మీత్ సింగ్ చెప్పారు. తాను పాఠశాలలో చేరే సమయానికి హిట్ మ్యాన్ పట్టభద్రుడయ్యాడని తెలిపారు. ఫస్ట్ క్లాస్ అరంగేట్ర మ్యాచులో రోహిత్ కూడా ఉన్నాడని పేర్కొన్నారు. ముంబై ఆటగాళ్లు అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతుండటం ఆనందంగా ఉందని చెప్పారు. ఇండియా తరఫున U-19లో శాంసన్, కుల్‌దీప్ యాదవ్, అక్షర్‌తో కలిసి ఆడినట్లు పేర్కొన్నారు.




# అన్న క్యాంటీన్లు మళ్లీ వస్తున్నాయ్!

ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు అన్నక్యాంటీన్లను పునరుద్ధరించే ఫైల్‌పైనా సంతకం చేశారు. రూ.5కే అల్పాహారం, భోజనం అందించే ఈ క్యాంటీన్లకు గత టీడీపీ హయాంలో మంచి ఆదరణే లభించింది. వీటిని మళ్లీ తెస్తుండటంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో ఏపీలో 183 క్యాంటీన్లు నడిచాయి. సగటున రోజుకు 2.50 లక్షల మంది భోజనం చేసేవారు. ఈసారి క్యాంటీన్ల సంఖ్య ఏ మేరకు పెంచుతారు? బడ్జెట్ ఎంత కేటాయిస్తారనేది చూడాలి.



# ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పెంపు

ఆధార్ కార్డును ఉచితంగా అప్‌డేట్ చేసుకునే గడువును కేంద్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. గతంలో నిర్ణయించిన గడువు నేటితో ముగియాల్సి ఉండగా, ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. అప్‌డేట్ చేసుకునేందుకు UIDAI ఆధార్ నంబర్, క్యాప్చా, ఓటీపీతో లాగిన్ అవ్వాలి. ఆ తర్వాత అవసరమైన డాక్యుమెంట్స్‌ను సమర్పించాల్సి ఉంటుంది.



# ఆమె కోసం హత్య చేసిన హీరో.. ఎవరీ పవిత్ర గౌడ?

హీరోయిన్ పవిత్ర గౌడ కోసం కన్నడ హీరో దర్శన్ హత్యారోపణలతో జైలుకెళ్లడం కన్నడనాట కలకలం రేపుతోంది. దీంతో ఎవరీ పవిత్ర గౌడ అంటూ నెటిజన్లు సెర్చ్ చేస్తున్నారు. 2016లో '54321'తో ఆమె సినిమాల్లోకి వచ్చారు. తమ బంధానికి పదేళ్లంటూ కొన్నాళ్ల క్రితం ఇన్‌స్టాలో ఆమె షేర్ చేసిన వీడియో నెట్టింట వైరల్ అయింది. దర్శన్ అసలు భార్యకు అన్యాయం జరుగుతోందని బాధపడిన ఓ ఫ్యాన్ పవిత్రను హెచ్చరించడం, హత్యకు గురికావడం జరిగాయి.

# వయనాడ్ బరిలో ప్రియాంకా గాంధీ?



కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంకా గాంధీ వయనాడ్ బరిలో నిలవనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే రాహుల్ గాంధీ ఈ స్థానానికి రాజీనామా చేయనున్నారని సమాచారం. దీంతో ఈ స్థానం నుంచి ప్రియాంకా రాజకీయ అరంగేట్రం చేయనున్నారని టాక్. కాగా గతంలో కూడా ఆమె ప్రధాని మోదీపై వారణాసిలో పోటీ చేస్తారని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత సోనియా గాంధీ వదులుకున్న రాయ్‌బరేలీ నుంచి కూడా ఆమె పోటీ చేస్తారని రాజకీయ విశ్లేషకులు భావించారు.

# ఓటీటీలో స్ట్రీమింగ్ కి వచ్చేసిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా నేహా శెట్టి అలాగే అంజలి ల కలయికలో దర్శకుడు కృష్ణ చైతన్య తెరకెక్కించిన లేటెస్ట్ చిత్రం "గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి". అయితే ఈ సినిమా ఎప్పుడో గత ఏడాదిలోనే రిలీజ్ కావాల్సింది అలా ఆలస్యం అవుతూ వచ్చి ఈ వేసవిలో రిలీజ్ అయ్యింది. అయితే ఈ చిత్రం థియేటర్లు లోకి వచ్చిన కేవలం రెండు వారల్లోనే ఓటీటీలో వచ్చేసింది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోగా అందులో ఈ సినిమా నేటి నుంచే అందుబాటులోకి వచ్చేసింది. మరి తెలుగు సహా ఇతర దక్షిణాది భాషల్లో ఈ సినిమా ఇప్పుడు అందుబాటులో ఉంది. మరి ఈ సినిమాని అప్పుడు మిస్ అయ్యి ఇప్పుడు చూడాలి అనుకునేవారు నెట్ ఫ్లిక్స్ లో చూడవచ్చు. ఇక ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు అలాగే సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే.

## ఏపీ నిరుద్యోగులకు గుడ్‌న్యూస్..


# 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ!

## త్వరలో నోటిఫికేషన్..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు గురువారం (జూన్ 13) బాధ్యతలు స్వీకరించారు. వెలగపూడి సచివాలయంలో కొలువు తీరిన చంద్రబాబు సర్కార్ తొలిరోజే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు.. తొలిసంతకం మెగా డీఎస్సీపై పెట్టారు. మొత్తం 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గత సర్కార్ వెలువరించిన పాత డీఎస్సీని బాబు సర్కార్ రద్దు చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి డీఎస్సీ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. డీఎస్సీ ప్రకటన నుంచి పోస్టుల భర్తీ వరకు మొత్తం ప్రక్రియను 6 నెలల్లోపే పూర్తి చేయనున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో నోటిఫికేషన్, దరఖాస్తు, పరీక్ష తేదీలు వివరాలు వెల్లడి కానున్నాయి. కాగా 2024 ఎన్నికల ముందు 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రకటన ఇవ్వగా 4,72,487 మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఎన్నికల కోడ్ కారణంగా అది వాయిదా పడింది. గురువారం సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు 5 అంశాల అమలుపై సంతకాలు చేశారు. వాటిల్లో మొదటిది.. నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డీఎస్సీ కల నెరవేర్చేందుకు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగానే 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ ప్రకటన విడుదల చేసేందుకు తొలి సంతకం చేశారు.

కేటగిరిల వారీగా పోస్టుల వివరాలు ఇలా..

| | |
|---|---|
| మొత్తం ఖాళీలు | 16,347 |
| సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ) పోస్టులు: | 6,371 |
| పీఈటీ పోస్టులు: | 132 |
| స్కూల్ అసిస్టెంట్స్ పోస్టులు: | 7725 |
| టీజీటీ పోస్టులు: | 1781 |
| పీజీటీ పోస్టులు: | 286 |
| ప్రిన్సిపల్స్ పోస్టులు: | 52 |



EVENING EDITION
శుక్రవారం | 14 జూన్ 2024
www.suryaa.com 4 PM
సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



# పెరిగిన పెన్షన్లు.. జీవో జారీ

ఏపీలో పెన్షన్ల పెంపుపై సీఎస్ నీరభ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సామాజిక పెన్షన్ల పేరును ఎన్టీఆర్ భరోసాగా పునరుద్ధరిస్తూ జీవో విడుదల చేశారు. ఇక నుంచి వృద్ధులు, వితంతువులు, మత్స్యకారులు, తదితరులకు నెలకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ అందనుంది. పెరిగిన పెన్షన్లను ఏపీఆర్ నుంచే ఇస్తామని గతంలో చంద్రబాబు చెప్పగా.. జులై 1న రూ.7వేల పెన్షన్ అందనుంది. అంటే ఏపీఆర్, మే, జూన్ నెలల అరియర్స్ రూ.3వేలు వస్తాయి.



# ఇందిరమ్మ ఇళ్లపై ప్రభుత్వం కసరత్తు

ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజల నుంచి వచ్చిన 82.82 లక్షల దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. అలాగే వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించింది. ఏడాదికి 4.50 లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. దరఖాస్తులు ఎక్కువగా వచ్చిన నేపథ్యంలో లబ్ధిదారులను లాటరీ విధానంలో ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.



# ‘థగ్ లైఫ్’ సెట్‌లో ప్రమాదం.. జోజు జార్జ్‌కి గాయం

మణిరత్నం డైరెక్షన్‌లో కమల్ హాసన్ నటిస్తోన్న ‘థగ్ లైఫ్’ సినిమా సెట్‌లో ప్రమాదం జరిగింది. పుదుచ్చేరిలో హెలికాప్టర్‌తో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా నటుడు జోజు జార్జ్ గాయపడ్డారు. వెంటనే మూవీ యూనిట్ ఆయన్ను ఆస్పత్రి తరలించింది. చికిత్స చేసిన వైద్యులు జార్జ్ ఎడమ కాలు ఫ్రాక్చర్ అయిందని తెలిపారు. కొన్ని వారాలు విశ్రాంతి అవసరమని సూచించారు. దీంతో ఆయన సన్నివేశాలను డైరెక్టర్ చిత్రీకరిస్తున్నారు.

# సూపర్ 8కు దూసుకెళ్లిన ఆఫ్ఘనిస్తాన్







టీ 20 ప్రపంచకప్‌లో గ్రూప్ సీలో అఫ్గానిస్థాన్... సూపర్ 8కు దూసుకొచ్చింది. పసికూన పపువా న్యూ గినియాతో జరిగిన మ్యాచ్‌లో ఘన విజయం సాధించిన అఫ్గాన్.. సూపర్ 8లో స్థానం ఖాయం చేసుకుంది. అఫ్గాన్ సూపర్ 8 ఎంట్రీతో గ్రూప్ సీలో మిగిలిన జట్లు న్యూజిలాండ్, ఉగాండ్, పపువా న్యూ గినియా లీగ్ దశలోనే వెనుదిరిగాయి. ఈ పొట్టి ప్రపంచకప్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన కివీస్ ఆడిన రెండు మ్యాచుల్లోనూ ఓడిపోయి లీగ్ దశలోనే వెనుదిరిగింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పపువా న్యూ గినియా 95 పరుగులకే కుప్పకూలింది. అనంతరం ఈ స్వల్ప లక్ష్యాన్ని అఫ్గానిస్థాన్ సునాయసంగా ఛేదించి సూపర్ ఎయిట్‌లోకి దూసుకొచ్చింది.

**మరో ఘన విజయం**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అఫ్గానిస్థాన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అఫ్గాన్ బౌలర్లు రాణించడంతో పపువా బ్యాటర్లు పరుగులు చేసేందుకు ఇబ్బంది పడ్డారు. రెండో ఓవర్లోనే పపువా తొలి వికెట్ కోల్పోయింది. అసద్ వాలా రనౌట్ కావడంతో పపువా తొలి వికెట్ కోల్పోయింది. కేవలం 12 పరుగుల వద్దే పపువా తొలి వికెట్ కోల్పోయింది. అనంతరం ఫరూకి పపువాను చావు దెబ్బ తీశాడు. వరుసగా రెండు వికెట్లు తీసి దెబ్బ కొట్టాడు. లెగా సియాక, సెసే బౌ వరుస బంతుల్లో పెవిలియన్ చేరారు. దీంతో అదే 12 పరుగుల వద్ద మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కాసేపటికి హిరీ హిరీ...టోనీ యురా కూడా అవుట్ కావడంతో పపువా న్యూ గినియా 30 పరుగులకే అయిదు వికెట్లు కోల్పోయింది. తర్వాత కాసేపు వికెట్ల పతనం ఆగింది. పపువా బ్యాటర్లు కిప్లిన్ డోరిగా, చాడ్ సోపర్ కాసేపు అఫ్గాన్ బౌలర్లను అడ్డుకున్నారు. వీరు కాసేపు బాగా ఆడడంతో పపువా మంచి స్కోరు చేసేలా కనిపించింది. కానీ చాడ్ సోపర్ రనౌట్ కావడంతో పపువాకు మరో ఎదురు దెబ్బ తగిలింది. తొమ్మిది పరుగులు చేసి సోపర్ అవుటయ్యాడు. దీంతో 46 పరుగుల వద్ద పపువా ఆరో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత వెంటనే నార్మన్ వనువా కూడా రనౌట్ కావడంతో 50 పరుగుల వద్ద ఏడో వికెట్ కోల్పోయింది. పపువా బ్యాటర్లలో కాసేపు పోరాడిన డోరిగాను నూర్ అహ్మద్ అవుట్ చేయడంతో పపువా పోరాటం ముగిసింది. డోరిగా 32 బంతుల్లో 27 పరుగులు చేశాడు. పపువా జట్టులో ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. పపువా బ్యాటర్లలో నలుగురు రనౌట్ కావడం విశేషం. అఫ్గాన్ బౌలర్లలో ఫరూకీ మూడు, నవీనుల్ హక్ రెండు వికెట్లు తీశారు. సునాయసంగానే 96 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గాన్... 15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. గుల్బదీన్ 49 పరుగులతో అజేయంగా నిలిచి అఫ్గాన్‌కు విజయాన్ని అందించాడు. అఫ్గాన్ ఓపెనర్లు రహ్మతుల్లా గుర్బాజ్ 11, జర్దాన్ సున్నా పరుగులకే వెనుదిరగడంతో అఫ్గాన్ 22 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. పపువా ఏమైనా అద్భుతం చేస్తుందా అని అనిపించింది. కానీ గుర్బాజ్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. నబీ, ఉమ్రాజాయ్ కూడా పర్వాలేదనిపించండతో అఫ్గాన్.. మరో 29 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించి సూపర్ 8లోకి విజయం సాధించింది. అఫ్గాన్ విజయంతో కివీస్ సూపర్ 8 ఆశలు ఆవిరైపోయాయి.




## ఇంటర్నేషనల్ అవార్డు రేసులో కెప్టెన్ మిల్లర్

ధనుష్ హీరోగా నటించిన కెప్టెన్ మిల్లర్ చిత్రం లండన్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ లో నామినేషన్ దక్కించుకుంది. ఉత్తమ విదేశీ సినిమా కేటగిరీలో నామినేట్ అయినట్లు మేకర్స్ వెల్లడించారు. అరుణ్ మాథేశ్వరన్ తెరకెక్కించిన ఈ చిత్రం జనవరి 12న విడుదలై రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్, సందీప్ కిషన్, ప్రియాంక మోహన్ కీలక పాత్రలు పోషించారు.



## 18వ లోక్‌సభలో టాప్10 రిచెస్ట్ ఎంపీలు వీరే

- చంద్రశేఖర్ పెమ్మసాని(టీడీపీ)- ₹5,705 కోట్లు
- కొండా విశ్వేశ్వర్ రెడ్డి (బీజేపీ) – ₹4,568 కోట్లు
- నవీన్ జిందాల్(బీజేపీ) – ₹1,241 కోట్లు
- ప్రభాకర్ రెడ్డి వేమిరెడ్డి (టీడీపీ) ₹716 కోట్లు,
- సీఎం రమేశ్(బీజేపీ)- ₹497 కోట్లు
- జ్యోతిరాదిత్య సింధియా(బీజేపీ)- ₹424 కోట్లు
- ఛత్రపతి సాహు మహరాజ్(కాంగ్రెస్)- ₹342 కోట్లు
- శ్రీభరత్ (టీడీపీ) – ₹298 కోట్లు
- హేమ మాలిని బీజేపీ)- ₹278 కోట్లు
- ప్రభ మల్లికార్జున్ (కాంగ్రెస్)- ₹241 కోట్లు



## కూర‘గాయాలు’.. భారీగా పెరిగిన ధరలు

కూరగాయల ధరలు 2-3 వారాల వ్యవధిలోనే 30-60 శాతం పెరిగాయి. రాష్ట్రంలో కూరగాయల పంటల సాగు 3.11 లక్షల ఎకరాలకే పరిమితమవడం, ఉత్పత్తి తగ్గడమే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. మే 20న కిలో ఉల్లి ₹20 పలకగా ఇప్పుడు ₹40-50కి చేరింది. టమాటా ₹60-90, వంకాయ ₹40-50, పచ్చి మిర్చి ₹80-120 ధర పలుకుతోంది. బీన్స్, క్యారట్, బీట్‌రూట్, క్యాప్సికం, కాకరకాయ, పుదీనా, కొత్తిమీర ధరలు కూడా రెట్టింపు అయ్యాయి.



## గ్రూప్ స్టేజీలోనే ఇంటిదారి పట్టిన లంక

మాజీ ఛాంపియన్ శ్రీలంక టీ20 ప్రపంచకప్-2024 నుంచి ఎలిమినేట్ అయింది. సౌతాఫ్రికా, బంగ్లాతో ఓటములు, నేపాల్‌తో మ్యాచ్ రద్దుతో గ్రూప్ స్టేజీలోనే ఇంటిదారి పట్టింది. ఈ టోర్నమెంటులో 3 మ్యాచులు ఆడిన హసరంగా సేన.. కేవలం ఒకే పాయింట్ సాధించింది. గ్రూప్-D నుంచి ఇప్పటికే సౌతాఫ్రికా సూపర్-8కి చేరింది. ఆ గ్రూపులోని నెదర్లాండ్స్, నేపాల్‌లతో పోలిస్తే సూపర్-8కు వెళ్లేందుకు బంగ్లాకు అవకాశాలు మెండుగా ఉన్నాయి.

## అటు క్యూటు.. ఇటు ట్రీటు.. ఐశ్వర్య మీనన్

తమిళ బ్యూటీ ఐశ్వర్య మీనన్ చాలా క్యూట్‌గా ఉంటుంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఈ బ్యూటీ షేర్ చేసే ఫొటోలు తెగ వైరల్ అవుతుంటాయి. ఇటు ట్రెడిషనల్ అటు మోడ్రన్ ఇలా ఐశ్వర్య మీనన్ ఇటీవలే 'భజే వాయు వేగం' చిత్రంతో ఆడియన్స్‌ను పలకరించింది. హీరో కార్తికేయతో నటించిన ఈ చిత్రం పెద్దగా క్లిక్ అవ్వకపోయినా ఐశ్వర్య మాత్రం మరోసారి అందంతో ఫిదా చేసింది. ఇందులో లంగావోణిలో అచ్చ తెలుగు అమ్మాయిలా ఐశ్వర్య అదిరిపోయింది. ఇక తాజాగా మోడ్రన్ లుక్‌లో గ్లామర్ ట్రీట్ ఇస్తూ షేర్ చేసింది. ఓ లుక్కేయండి.






## ఆన్‌లైన్ గేమింగ్ జీఎస్‌టీపై కేంద్రం సమీక్ష!

ఆన్‌లైన్ గేమింగ్‌పై 28% పన్ను విధించడాన్ని GST కౌన్సిల్ ఈనెల 22న జరిగే సమావేశంలో పునఃపరిశీలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు పలు వస్తువులకు విధించే ఇన్వర్టెడ్ ట్యాక్స్ విధానంపైన ఫిట్‌మెంట్ కమిటీ సూచనలను సమీక్షించనున్నట్లు సమాచారం. కాగా 2023 అక్టోబరు 1న ఆన్‌లైన్ గేమింగ్‌పై 28% GSTని కేంద్రం అమలులోకి తీసుకొచ్చింది. ఆరునెలలు దాటడంతో ముందుగా అనుకున్నట్టు కౌన్సిల్ దానిని పరిశీలించనుంది.